క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. 51 వేల విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు పాలకొల్లుకు చెందిన గోటేటి సత్యన్నారాయణ మూర్తి బుధవారం రూ. 51,116 విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

పంచలోహ శ్రీచక్రం సమర్పణ



దాత గుడిమెట్ల యుగంధర్ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని విజయదుర్గ అమ్మవారికి బుధవారం గుడిమెట్ల యుగంధర్, ఉషారాణి దంపతులు రూ. 72,116 విలువైన పంచలోహ శ్రీచక్రాన్ని సమర్పించారు. యుగంధర్ దంపతులకు ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలాచార్యులు వేద ఆశీర్వచనం అందించి, అమ్మవారి శేషవస్త్రాలు, చిత్రపటంతో సత్కరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామ్మోహనరావు, సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ఏపీఎస్పీ కమాండెంట్



రాహుల్‌దేవ్ శర్మకు శేషవస్త్రాన్ని కప్పుతున్న దృశ్యం

ద్వారకాతిరుమల : శ్రీవారి దివ్య క్షేత్రాన్ని ఏపీఎస్పీ విజయనగరం జిల్లా చింతలవలస ఐదవ బెటాలియన్ కమాండెంట్ రాహుల్‌దేవ్ శర్మ బుధవారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు స్వామివారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్



నినదిస్తున్న హమాలీ కార్మికులు

జంగారెడ్డిగూడెం : హమాలీ, మోటార్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఇఫ్టూ డివిజన్ నాయకులు బైరెడ్డి రాము డిమాండ్ చేశారు. పొగాకు బోర్డ్ హమాలీ వర్కర్ల యూనియన్ జనరల్ బాడీ సమావేశం బుధవారం వాసుబోయిన శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బైరెడ్డి రాము మాట్లాడుతూ 137వ మేడే ను జయప్రదం చేయాలని జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. హమాలీ, మోటార్ రంగ కార్మికులకు ప్రభుత్వాలు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మేడే సందర్భంగా సంక్షేమ బోర్డు ఏర్పాటుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

వ్యక్తి అరెస్ట్

పోలవరం : ఇద్దరు వ్యక్తుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో గంధ్రోతు గోపిని ఎల్ఎన్ డీపేట గ్రామ సమీపంలో అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్ కుమార్ తెలిపారు. ప్రగడపల్లి గ్రామానికి చెందిన పాతాళ సోమరాజు, అదే గ్రామానికి చెందిన గంధ్రోతు గోపిల మధ్య కొడవళ్లతో గాయపర్చుకున్న ఘటనలో సోమరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చెప్పారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్

దెందులూరు: దోసపాడులో పేదలకు భూములు పంచాలని, కొన్ని రోజులుగా దళిత సంఘాలు, కమ్యూనిస్టు సంఘాలు పోరాటం చేస్తున్న సంగతి విదితమే. ఈ నేపథ్యంలో వివాదాస్పద చెరువుల వద్ద చేపలు పట్టకుండా గ్రామంలో చెరువుల వద్ద ఎటువంటి శాంతిభద్రతలు తలెత్తకుండా ఎస్పీ ఆదేశాల మేరకు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య 144 సెక్షన్ ఏర్పాటు చేశారు. పెదవేగి సీఐ ఎన్.దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో దెందులూరు ఎస్సై ఐ.వీరరాజు, దోసపాడు వంతెన వద్ద 15 రోజులుగా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు
- పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఎలీజాతో కలిసి ప్రారంభోత్సవం



శ్రీనివాసపురంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్ : అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారని, నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటా లబ్ధి చేకూరిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, వినియోగదారుల శాఖామాత్యులు కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని శ్రీనివాసపురంలో నూతనంగా రూ.39.30 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ భవనాలను చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజాతో కలిసి మంత్రి కారుమూరి ప్రారంభించారు. పేదలందరికి ఇళ్లు జగనన్న కాలనీల్లో నిర్మించిన ఇంటిని గృహ ప్రవేశం చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి కారుమూరి మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కన పెట్టిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో పేదలందరికి సమానంగా సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందిస్తూ పరిపాలన కొనసాగిస్తున్నారని తెలిపారు. వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు సంక్షేమ పాలనను చేరువచేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ఈ రెండు రంగాల్లోనూ విప్లవాత్మక సంస్కరణలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. దేశంలో గతంలో ఆంధ్రప్రదేశ్ విద్యారంగంలో 14వ స్థానంలో ఉండేదని ప్రస్తుతం 2వ స్థానంలో ఉందని దీనిని బట్టి రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఎంత ప్రాధాన్యతనిస్తోందో అర్థమవుతోందన్నారు. వేల కోట్లు రూపాయల నిధులను మంజూరు చేయించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతులతోపాటు గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను కూడా ఏర్పాటు చేసి ప్రజల దగ్గరకు వైద్య సేవలను అందిస్తున్నారని చెప్పారు.

అనంతరం ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా మాట్లాడుతూ శ్రీనివాసపురంలో రూ.17.50 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఝాన్సిరాణి, ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్ సీపీ పామర్రు నియోజకవర్గం పరిశీలకులు మండవల్లి సోంబాబు, సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ బుజ్జవరపు తాతారావు, ఏఎంసీ చైర్మన్ జానకి రెడ్డి, ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చిల్డ్రన్స్ వెల్ఫేర్ రీజనల్ చైర్మన్ వందనపు సాయి బాల పద్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పీపీఎస్ చంద్రరావు, జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైస్ ఎంపీపీ నరెడ్ల బుజ్జిబాబు, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో...

గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామిని బుధవారం పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా దర్శించుకున్నారు. స్వామివారికి తమలపాకులతో పూజలు నిర్వహించారు. తొలుత వారికి ఈవో ఆకుల కొండలరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో వేద పండితులు మంత్రి, కారుమూరి, ఎమ్మెల్యే ఎలీజాలకు వేద ఆశీర్వచనాలు అందజేశారు. స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఉమెన్ డెవలప్‌మెంట్ చిల్డ్రన్ వెల్ఫేర్ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాల పద్మ, సర్పంచ్ గుబ్బల సత్యవేణి, ఎంపీటీసీ కొయ్య రమారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పీపీఎస్ చంద్రరావు, మహిళా నాయకురాలు సాయిల స్వాతి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

రైస్ మిల్లు కార్మికుల వేతనాలు పెంచాలి

జంగారెడ్డిగూడెం : రైస్ మిల్లు కార్మికుల వేతనాలు పెంచాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. వేతనాలు పెంచాలని కోరుతూ రైస్ మిల్లుల యాజమాన్యం, బియ్యం వ్యాపారులకు రైస్ మిల్లు వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో డిమాండ్ నోటీసు బుధవారం అందజేసినట్లు ఆయన తెలిపారు. కరోనా కారణంగా రెండేళ్ల నుంచి కూలి రేట్ల పెంపు జరగలేదని, యాజమాన్యం కూలి రేట్లు పెంచటానికి విముఖత చూపుతున్నారని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని, పిల్లలు చదువులు, వైద్యం ఖర్చులు భారీస్థాయిలో పెరిగాయన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కూలి రేట్లు పెంచకపోతే సమ్మెకు కార్మికులు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్లు కె.శ్యామలరావు, మాడిసి కొండయ్య, బోణంగి చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యా విప్లవానికి జగన్ దిక్సూచి



జగనన్న వసతి దీవెన ద్వారా లబ్ధి చేకూరిన విద్యార్థులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

కొయ్యలగూడెం: విద్యా విప్లవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిక్సూచిగా నిలబడ్డారని ఆయన పాలనలో తమ పిల్లలు విద్యను అభ్యసిస్తుండడం పూర్వజన్మ సుకృతంగా తల్లిదండ్రులు భావిస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. బుధవారం రాజవరం గ్రామంలో జగనన్న వసతి దీవెన పొందిన విద్యార్థులను కలుసుకొని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో నాలుగో విడత విద్యా దీవెన పథకంలో భాగంగా 3,874 మంది విద్యార్థులకు రూ. 3.74 కోట్ల లబ్ధి చేకూరనుందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి నియోజకవర్గంలో ఇప్పటివరకు వసతి దీవెన పథకానికి రూ. 19.20 కోట్లు వెచ్చించడం జరిగిందన్నారు. కొయ్యలగూడెం మండలంలో 1159 మంది విద్యార్థులు, 1049 మంది తల్లుల అకౌంట్‌లలో రూ.1.12కోట్లు జమ చేసినట్లు ఏఎస్‌డబ్ల్యూవో సంకురయ్య తెలిపారు. అదేవిధంగా బుట్టాయిగూడెంలో 493 విద్యార్థులకు రూ. 48 లక్షలు, పోలవరంలో 621 మందికిగాను రూ. 59 లక్షలు, వేలేరుపాడులో 202 మంది విద్యార్థులకు రూ. 20 లక్షలు, టి.నరసాపురంలో 789 మందికి రూ. 77 లక్షలు, కుక్కునూరులో 286 మంది విద్యార్థులకు రూ. 27 లక్షలు, జీలుగుమిల్లిలో 324 మంది విద్యార్థులకు రూ.32 లక్షలు కలిపి మొత్తం రూ. 3.74 కోట్లు ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, మాజీ సర్పంచ్ పి.మునిస్వామి, గ్రామ కన్వీనర్ శ్రీరంగ నిలయం విశ్వనాథం, కళ్యాణ్, తమ్మిర్చి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు ఇళ్ల పట్టాల పంపిణీ



నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్ : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన గిరిజనేతర నిర్వాసితులకు ఇళ్ల స్థలాలకు సంబంధించి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పట్టాలు పంపిణీ చేశారు. ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో ఒకటైన టేకూరు, మాదాపురం, శివగిరి గ్రామాలకు చెందిన గిరిజనేతరులైన 141 మంది నిర్వాసిత కుటుంబాలకు బుధవారం ఆయన నివాసం వద్ద ఇళ్ల పట్టాలు అందజేశారు. వీరందరికీ జంగారెడ్డిగూడెం ప్రాంతంలోని చల్లావారిగూడెం నందు ఇంటి స్థలాలు కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకట రెడ్డి, తహసీల్దార్ సుమతి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రమేష్

కామవరపుకోట : అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. తడికలపూడిలోని రెడ్డి కాలనీలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌ను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ప్రతిరోజు పిల్లలకు ఇచ్చే మెనూ గూర్చి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ రమేష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాడు–నేడుతో అంగన్‌వాడీ కేంద్రాల రూపు రేఖలు మార్చి కావాల్సిన మౌలిక వసతులు సమకూర్చారన్నారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకుని కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి రజని శ్రీనివాస్, ఎంపీటీసీ గంగుల కడియాలు, వార్డ్ మెంబర్ బన దుర్గారావు పాల్గొన్నారు.

మళ్లీ సీఎం వైఎస్ జగనే కావాలి



అక్కంపేటలో సంక్షేమ లబ్ధి బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్ : ప్రభుత్వ పథకాల లబ్ధితో ప్రజలు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. అక్కంపేటలో బుధవారం 2వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులకు సక్రమంగా అందించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు పనిచేయాలన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ నగదు పొందాలంటే దూర ప్రాంతాల్లో ఉన్న కార్యాలయాల వద్దకు వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వంలో ఇంటి వద్దకే పింఛన్ నగదును అందించే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సచివాలయ కార్యాలయాల్లో అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ పారేపల్లి నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఉప సర్పంచ్ వింజమూరి కిరణ్ కిషోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పసుపులేటి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యం విషయంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతూ జిల్లా కోఆర్డినేటర్ టీఎన్ స్నేహన్

పోలవరం రూరల్ : సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల సాధనకు ప్రభుత్వం గ్రామస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసిందని సచివాలయ శాఖ సామాజిక ప్రవర్తన మార్పు సమాచారం విభాగం జిల్లా కోఆర్డినేటర్ టీఎన్ స్నేహన్ అన్నారు. బుధవారం పోలవరం మండలం వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టాస్క్‌ఫోర్స్ కమిటీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో 2, 3 సాధనకు గర్భిణీలు, బాలింతలు, యుక్త వయస్సు బాలల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. యుక్త వయస్సు బాలికలకు క్రమం తప్పకుండా రక్తపరీక్షలు జరపాలన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు గ్రామస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ ప్రతినెలా సమావేశమై సమీక్షించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కె. మురళీధర్, ఎంపీహెచ్ఈవో జి. సోమరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీజీఈఏ రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలి

పోలవరం రూరల్: ఈనెల 30 వతేదీన రాజమహేంద్రవరంలో జరిగే ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏపీజీఈఏ రాష్ట్ర స్థాయి సదస్సు జయప్రదం చేయాలని పోలవరం యూనిట్ సంఘం అధ్యక్షుడు ఎం, వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు. పోలవరంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం తాలుకా యూనిట్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం దిశగా రాజమహేంద్రవరం ఆనంద్ కళాక్షేత్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సమావేశానికి అన్ని సంఘాల ఉద్యోగులు హాజరుకావాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చింతలపూడి: నాగిరెడ్డిగూడెం ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (బాలికలు)లో టీజీటీ సంస్కృతము గెస్ట్ ప్రాతిపదికన సేవలు వినియోగించుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యాబోధన చేయాల్సి ఉంటుందని, నెలసరి జీతం రూ. 14,800గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థి సాహిత్య విద్యాప్రవీణ లేదా ఎంఏ సంస్కృతం ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మే 15 తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని వివరాలకు 99596 66156 నంబరులో సంప్రదించాలన్నారు.

గురుకుల ప్రవేశానికి గడువు పెంపు

ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాసంస్థల్లో 5,6,7,8 తరగతులు, జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం ఇంటర్, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 24 నుంచి 28 వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ ఎం. సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 99596 66156 నంబరులో సంప్రదించాలన్నారు.

పూర్వ ఉపాధ్యాయుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఎంఈఓ జగన్మోహన్‌రావు

వేలేరుపాడు : వేలేరుపాడు మండలం మాకు కన్నతల్లి వంటిది.. ఎన్నో అనుభవాలు.. మరువలేని జ్ఞాపకాలు.. అనుభూతులు పొందాము. ఈ ప్రాంతాన్ని ఎన్నటికీ మర్చిపోలేము అని పూర్వ ఉపాధ్యాయులు పేర్కొన్నారు. బుధవారం వేలేరుపాడు మండలంలోని కొర్రాజులగూడెం గ్రామంలో పూర్వ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గతంలో ఈ మండలంలో పనిచేసిన ఉపాధ్యాయులు వారి అనుభవాలు, జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గతంలో పనిచేసిన ఎంఈఓలు జగన్మోహన్‌రావు, పురుషోత్తమరావు, సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు మోహన్ రావు, వలపర్ల కృష్ణ, పారుపల్లి నాగేశ్వరరావు, రామకృష్ణ, శాంతన్, రవికుమార్, బాలాజి, హరి, సిద్దు, వినోద్, బుచ్చయ్య, భీమయ్య, బాబూరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి



టి.నరసాపురంలో ప్రచార భేరి నిర్వహిస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

టి.నరసాపురం : మోదీ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలంతా పోరాడాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. టి.నరసాపురంలో బుధవారం ప్రచార భేరి నిర్వహించారు. అనంతరం ప్రధాన సెంటర్‌లో సీపీఐ మండల కార్యదర్శి సాకా గంగరాజు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడారు. తొమ్మిదేళ్ళ మోదీ పాలనలో గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగి సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు నానా హింసలు అనుభవిస్తున్నారని అన్నారు.

చింతలపూడి : ప్రగడవరంలో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో మోదీని గద్దె దించండి – దేశాన్ని కాపాడండి అంటూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచార యాత్ర కొనసాగించారు. ప్రజల సంపదను ఆదాని, అంబానీలకు అప్పనంగా కారు చౌకగా కట్టబెట్టడం వల్ల వారు ప్రపంచంలోనే కుబేరులుగా మారారన్నారు. మోదీని గద్దె దించితేనే ప్రజల సంపద రక్షించబడి దేశం కాపాడబడుతుందన్నారు.

పోలవరం రూరల్ : సీపీఐ, సీపీఎం మండల సమావేశం దేవరగొంది గ్రామంలో సీపీఎం మండల కార్యదర్శి జి. వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. జిల్లా కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలపై పోరాడాలన్నారు.

విజయవంతంగా మా నమ్మకం నువ్వే జగన్



తాడిపర్రులో సంక్షేమ పథకాలు వివరిస్తున్న గృహ సారథులు, కన్వీనర్లు, పార్టీ శ్రేణులు



గంగవరంలో వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి నూతన వధూవరుల ప్రచారం



ములగలంపల్లి పార్టీ కరపత్రాలను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

కామవరపుకోట : తాడిచర్ల సచివాలయం పరిధిలో బుధవారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం విజయవంతంగా ముగించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ప్రజల అభిప్రాయాన్ని నమోదు చేసుకున్నారు. అనంతరం జగనన్న స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. ఈ సందర్భంగా సచివాలయం కన్వీనర్ పండు మాట్లాడుతూ ప్రజల ఆశీస్సుతో వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గెలిచి మరిన్ని సంక్షేమ పథకాలు అమలు పరుస్తారని అన్నారు. కార్యక్రమంలో డేవిడ్, రామకృష్ణ, ఏసు, కొప్పుల శ్రీను, తలపాకుల శ్రీను, మనెల్లి బూరియ్, దశరథ రామకృష్ణ, సుమాంజనీయులు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గంగవరంలో ఉత్సాహంగా..

కొయ్యలగూడెం : జగనన్నతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. గంగవరం గ్రామంలో బుధవారం గ్రామ కన్వీనర్ కంచర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రచారం చేస్తున్న సభ్యులకు అదే గ్రామంలో వివాహం జరుపుకున్న నూతన వధూవరులు ఉండి రాకేష్, యాదాల అఖిల మద్దతు పలికారు. వారు కూడా ప్రచారంలో పాల్గొని ఇంటింటికీ జగనన్న స్టిక్కర్లను అతికిస్తూ పార్టీ శ్రేణులను, గ్రామస్తులను ఉత్సాహపరిచారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కొండేపాడి చింతయ్య, సచివాలయ కన్వీనర్లు కుర్రు నాగబాబు, ఈడుపుగంటి తాతారావు, మద్దపట్ల సోమేశ్వరరావు, కోటా ఫణి, సీహెచ్ మంగరాజు, ఉండి ఆనందరావు, ఈడుపుగంటి సూరిబాబు, కొడారి చిన్న, పులపాకుల బాల యేసు, కొడారి రేఖ, వూసా దామోదరం, చింతా కృష్ణ, మాదేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ములగలంపల్లి సచివాలయం పరిధిలో...

బుట్టాయగూడెం: (జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి సచివాలయం పరిధిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. వైస్ ఎంపీపీ సోమగాని శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు గంటశాల గాంధీల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు బుధవారం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలపై వివరించారు. అనంతరం మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇళ్ల తలుపులకు అతికించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గంగిరెడ్ల సత్యనారాయణ, నాయకులు బరగడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.